వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, ఆగస్టు 24, 2026

# 'నా పర్యటనను అడ్డుకోవచ్చు.. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాన్ని అడ్డుకోలేరు'

- అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- ఇది వ్యక్తిగత అవమానం కాదు..
- నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయం







**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశాంగ మంత్రిత్వ శాఖకు అందించామని తెలిపారు. ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి నిరాకరించడంపై కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. విద్య, క్రీడలు, పెట్టుబడులే లక్ష్యంగా విదేశీ పర్యటనకు కార్యాచరణ రూపొందించామని సీఎం తెలిపారు. విదేశాల్లోని విద్యా, క్రీడా అవకాశాలను తెలంగాణకు తీసుకురావడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించేందుకు పర్యటనలు ఉపయోగపడతాయని భావించామని చెప్పారు. "రాజకీయ కారణాలతోనే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించామని కేంద్రం తెలిపింది. ఆ రాజకీయ కారణాలు ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడా పర్యటనకు గుజరాత్ ముఖ్యమంత్రికి అనుమతి ఇచ్చి, తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా తాను అమెరికా వెళ్లేందుకు అనుమతి నిరాకరించడం వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. తన పర్యటనను తిరస్కరించడమే కాకుండా బీజేపీ నాయకులు వ్యక్తిగత ఆరోపణలు చేయడాన్ని సీఎం తప్పుబట్టారు. ఇది తనకు వ్యక్తిగతంగా జరిగిన అవమానం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని అన్నారు. కేంద్రం వైఖరి ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని, తెలంగాణపై వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని తమ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని రేవంత్‌రెడ్డి తెలిపారు. "నా పర్యటనను అడ్డుకోవచ్చు.. కానీ తెలంగాణ అభివృద్ధి లక్ష్యాన్ని చేరుకోకుండా అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. విద్య, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. అధికారిక విదేశీ పర్యటనకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు భారత రాయబార కార్యాలయాల పర్యవేక్షణలోనే జరుగుతాయని, ఇందులో దాపరికం లేదని స్పష్టం చేశారు.

# 4వ బెటాలియన్ కమాండెంట్‌ను కలిసిన రిటైర్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**రిటైర్డ్ పోలీసుల సంక్షేమంపై సానుకూల చర్చ..**

**మద్దతు ఇస్తామని కమాండెంట్ హామీ**

**వరంగల్ , వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి. సత్య శ్రీనివాస్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమాండెంట్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రిటైర్డ్ పోలీస్ అధికారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, బెటాలియన్ పరిధిలో రిటైర్డ్ సిబ్బందికి అందించాల్సిన సహాయ సహకారాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రిటైర్డ్ పోలీసు అధికారుల అనుభవం, సేవలను కమాండెంట్ అభినందించారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రంగరాజు ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఎం. లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఈ. జోగిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు జి. కుమారస్వామి, కె. మురుగన్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాజేశ్వర్‌రావు, ఆర్ఐ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




# కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భూముల వేలాన్ని రద్దు చేయాలి

- పేదల కోసం ఉద్దేశించిన భూములను వ్యాపారానికి అమ్మొద్దు..
- భూకబ్జాలను అరికట్టలేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి
- మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలో ఏర్పాటు చేసిన భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. హౌసింగ్ బోర్డు పేదలకు సొంత ఇళ్లు కల్పించేందుకు ఏర్పడిందని, భూములను వ్యాపార ప్రయోజనాల కోసం విక్రయించడం సరికాదన్నారు. సోమవారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో వేలానికి ఉంచిన ప్లాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన అనంతరం ఈటల రాజేందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్ 2న నిర్వహించనున్న వేలాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఖాళీ స్థలాలను పాఠశాలలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, ఆసుపత్రులు తదితర ప్రజావసరాలకు వినియోగించాలని సూచించారు. కూకట్‌పల్లి, కైతలాపూర్, హైదర్‌నగర్ పరిధిలో హౌసింగ్ బోర్డు కోసం సుమారు 1,400 ఎకరాలు సేకరించారని ఈటల తెలిపారు. గతంలో పలు సంస్థలకు భూములు విక్రయించడం ద్వారా వచ్చిన నిధులను ప్రజా సంక్షేమానికి వినియోగించాల్సి ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం భూముల విక్రయాలపై దృష్టి పెట్టిందని ఆరోపించారు. హౌసింగ్ బోర్డును రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చొద్దని అన్నారు. ఎల్లమ్మబండ, షంషీగూడ సర్వే నంబర్ 57 పరిధిలోని భూముల వ్యవహారంపై కూడా ఈటల రాజేందర్ తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో పేదలు, జర్నలిస్టులకు స్థలాలు కేటాయించిన భూముల్లో మిగిలిన విస్తీర్ణంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హనర్ హోమ్స్‌కు గత ప్రభుత్వం కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని గతంలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

## పేదలకు అక్కడే ఇళ్లు నిర్మించాలి

బస్తీల్లో నివసిస్తూ అక్కడే ఉపాధి పొందుతున్న పేదలకు నగరానికి దూరంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించడం వల్ల వారు ఉపాధి కోల్పోతున్నారని ఈటల అన్నారు. పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రూ.6 లక్షలతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని, అర్బన్ సీలింగ్ భూములను కూడా కాపాడాలని డిమాండ్ చేశారు. భూకబ్జాలను అరికట్టే సత్తా లేకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని ఈటల రాజేందర్ కోరారు. భూముల విక్రయాలను నిలిపివేయకపోతే ప్రజల తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్‌రావు, మహేందర్, ప్రీతంరెడ్డి, బలవంత్‌రెడ్డి, సుధం, వరలక్ష్మి, వినోద్, ఐలయ్య, సత్యనారాయణ, ఎంఎస్ రెడ్డి పాల్గొన్నారు.

# కేంద్రం ముందు రేవంత్ సర్కార్ మోకరిల్లింది

- ప్రీపెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ముందు రాష్ట్ర ప్రభుత్వం మోకరిల్లిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. సోమవారం ఆమె వీడియో సందేశం విడుదల చేసి, అనంతరం పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పవర్ ఎక్స్‌పో–2026ను సందర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌తో పాటు లాండ్రీ షాపులు, సెలూన్లకు అందుతున్న ఉచిత విద్యుత్‌ను కూడా తొలగించే ప్రయత్నం జరుగుతోందని కవిత ఆరోపించారు. కేంద్ర పథకంలో భాగంగానే రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, గతంలో వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేసే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. ప్రీపెయిడ్ మీటర్ల వల్ల సెల్‌ఫోన్ రీచార్జ్ మాదిరిగా ముందుగానే విద్యుత్ చార్జీలు చెల్లించాల్సి వస్తుందని, రీచార్జ్ పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న మీటర్లతోనే విద్యుత్ సరఫరా కొనసాగించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్లు, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించి విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజాక్షేత్రంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.



## అవినీతికి మూలకారకుల సంగతేంటి?

గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన అధికారులపై ఏసీబీ చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, వారికి వెనుక ఉండి అవినీతికి పాల్పడే అసలు వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కవిత ప్రశ్నించారు. అధికారులు అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకునే వారిని కూడా బాధ్యులను చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులతో పాటు, వారి ద్వారా వ్యవస్థలను దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై పౌర సమాజం చర్చించాలని ఆమె కోరారు.